
## రోడ్డుపక్కనున్న గుంతలోకి దూసుకెళ్లిన మినీ ట్రక్..

**తక్షణమే స్పందించిన వంగర పోలీసులు**




**భీమదేవరపల్లి/జూన్18 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి మినీ ట్రక్ అదుపుతప్పి రోడ్డుపక్కనున్న గుంతలోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వంగర పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. ముందుగా ట్రక్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి, అనంతరం తాళ్ల సహాయంతో గ్రామస్థులతో కలిసి మినీ ట్రక్‌ను గుంత నుంచి బయటకు తీశారు. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిసింది. సమయస్ఫూర్తితో స్పందించి సహాయక చర్యలు చేపట్టిన వంగర పోలీసుల సేవలను డ్రైవర్‌తో పాటు గ్రామస్థులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగుల మధ్య ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచిన సహాయం

**తోటి ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన ఉపాధి హామీ సిబ్బంది**



**భీమదేవరపల్లి/జూన్18 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శోభ భర్త ప్రభాకర్ ఇటీవల అకాల మరణం చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ కష్ట సమయంలో శోభ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో భీమదేవరపల్లి మండల ఉపాధి హామీ పథకం సిబ్బంది మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేశారు.
మండల ఎంపీడీవో వీరేశం, ఏపీవో కుమారస్వామి ఆధ్వర్యంలో ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీనియర్ మేట్లు కలిసి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి శోభ కుటుంబానికి అందించారు. ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తున్న తమ సహోద్యోగి కుటుంబం కష్టకాలంలో ఒంటరిగా ఉండకూడదనే భావనతో ఈ సహాయాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, తమ సహోద్యోగి కుటుంబానికి తామంతా అండగా ఉన్నామనే భరోసా కల్పించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. చిన్న సహాయమే అయినప్పటికీ, ఆపదలో ఒకరికి ఒకరు తోడుగా నిలవడం ఉద్యోగుల మధ్య ఉన్న ఆత్మీయతకు నిదర్శనమని అన్నారు. అకాల మరణం చెందిన ప్రభాకర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, శోభతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఎస్ఐని సన్మానించిన ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు





**బయ్యారం/,జూన్ 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబును ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి నరేందర్,ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ బాబును గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు.మండలం లో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని చెరుకుపల్లి నరేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ బాబు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతిభద్రతలను మరింత పటిష్టంగా అమలు చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ కాలనీ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి.. రైతుకు రూ. లక్ష ఆస్తి నష్టం

**తల్లాడ, /జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):**



తల్లాడ మండల పరిధిలోని వెంకట్రామా తండాలో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో ఓ గేదె మృతి చెందగా, రైతుకు సుమారు రూ. లక్ష మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు సమాచారం.స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్నపేట గ్రామానికి చెందిన భూక్య హుస్సేన్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్లిన సమయంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన గేదె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.మృతిచెందిన గేదె ఇటీవలే కొనుగోలు చేసినదని, దాని విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గేదె మృతి చెందడంతో కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని తెలిపాడు.ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో ఉండటంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు.జీవనాధారమైన పశువును కోల్పోయిన బాధిత రైతుకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ తక్షణమే నష్టపరిహారం

# బిఎల్ఓలకు అవగాహన కార్యక్రమం.




**-తహసీల్దార్ నాగరాజు.**

**బయ్యారం/,జూన్ 18.(జర్నలిస్ట్ వార్త)**
ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ స్థాయి ఏజెంట్ బిఎల్వోలకు,బీఎన్ఏ శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని బయ్యారం మండల రైతు వేదికలో గురువారం నిర్వహించినట్లు తహసీల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూభారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా ఉండేందుకు జూన్ 25 నుండి జులై 24 వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నమన్నారు.బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారంను పంపిణీ చేస్తారు.ఓటర్లకు సంబంధించిన వివరాలను నింపుటకు సహాయం చేసి ఎన్యూమరేషన్ ఫారంను తీసుకోవాలన్నారు.ఫారంలో మీ పూర్వ ఫోటో,ప్రస్తుత ఫోటో జతచేసి పుట్టినతేది,ఫోన్ నంబరు,మీ తల్లిదండ్రుల,మీ భాగస్వామి యొక్క వివరాలను తెలపలన్నారు.ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్డేట్ చేసుకోని పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని ఓటర్లను తహసీల్దార్ కోరారు.సిబ్బందికి ఎలక్షన్ కమిషన్ సప్లై చేసిన బిఎల్ఓ కిట్స్, వాల్ పోస్టర్లు,పాంప్లెట్స్,ఫ్లెక్సీలు తదితర సామాగ్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనిస్



రాందాస్,నాగుల మీరా,ఆర్ఐలు,సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదరిక నిర్మూలన సాధ్యం

**లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో విజయ్‌కుమార్**



**ఎల్కతుర్తి,/ జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంత నివాసం కల్పించి పేదరిక నిర్మూలన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకుడు శీలం అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన గృహాలను పూర్తి చేసుకున్న లబ్ధిదారులు బండారి లక్ష్మీరాజు, అల్లం శిరీషరాజు కుటుంబాల గృహ ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో విజయ్‌కుమార్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శీలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ, అర్హులైన నిరుపేదలకు పక్కా గృహాలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.ఎంపీడీవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గౌడిశాల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు పాక రమేష్, శనిగరపు వెంకటేష్‌స్వరూప, యువ కాంగ్రెస్ నాయకుడు గౌడిశాల అర్జున్ గౌడ్, హౌసింగ్ ఏఈ ప్రవీణ్, నాగరాజు, కిరణ్, వీణవంక రమేష్ చారి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

**ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ డిమాండ్**




**నర్సంపేట/, జూన్ 18 (జర్నలిస్టు వార్త):** రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ డిమాండ్ చేశారు.నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్‌లో మార్త నాగరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉన్నప్పటికీ, అనేక సంస్థలు ఆ నిబంధనలను పాటించడం లేదని ఆరోపించారు.షూ, బెల్ట్, పాఠ్యపుస్తకాలు, వ్యాన్ ఫీజులు, టెక్నో, డిజిటల్, మెడికల్ ఫీజుల పేర్లతో అనుమతులు లేకుండానే విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్లను ఆర్టీవో అధికారులు తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన తరగతి గదులు, ఫైర్ సేఫ్టీ వంటి కనీస సౌకర్యాలు లేకుండా కొనసాగుతున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో బీఈడీ, టెట్ అర్హతలు లేని ఉపాధ్యాయులు బోధన నిర్వహిస్తున్నారని ఆరోపించిన ఆయన, విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి నిబంధనలు అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో డివిజన్ కమిటీ సభ్యులు రాకేష్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ప్రారంభం




**నేలకొండపల్లి,/ జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా-అక్క కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ లెర్నింగ్‌పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.మాస్టర్ ట్రైనర్ డాక్టర్ కె. మందాకిని విద్యార్థులకు ఏఐ ఆధారిత సాధనాల వినియోగం, వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యాల పెంపు, డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ఉపయోగం గురించి వివరించారు. అలాగే అన్నా-అక్క కార్యక్రమం లక్ష్యాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.
ఈ శిక్షణ పొందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు పరిసర ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏఐ, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడంలో అన్నా-అక్క కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఏఐ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వర రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ నడిబొడ్డున మిల్లులు.. ప్రజలకు ముప్పు!

## ఫిట్‌నెస్ లేని మిల్లులను సీజ్ చేయాలని సీపీఐ డిమాండ్




**తల్లాడ, /జూన్ 18 (జర్నలిస్ట్ వార్త )** మండల కేంద్రంలోని పప్పు, వడ్ల మిల్లుల ఫిట్‌నెస్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మద్దోజు శ్రావణ్ కుమార్ కోరారు. ఫిట్‌నెస్ లేని మిల్లులను వెంటనే గుర్తించి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లాడలో ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల మధ్యలోనే కొన్ని మిల్లులు కొనసాగుతున్నాయని, వాటి నుంచి వెలువడుతున్న ధూళి, వ్యర్థాల కారణంగా స్థానికులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న మిల్లులను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని సూచించారు. మిల్లుల్లోని యంత్రాల పరిస్థితిని అధికారులు పరిశీలించి, భద్రతా ప్రమాణాలు పాటించని యంత్రాలను వినియోగం నుంచి తొలగించాలని కోరారు. ఫిట్‌నెస్ లేని యంత్రాల వల్ల కార్మికులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మిల్లులపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని మద్దోజు శ్రావణ్ కుమార్ హెచ్చరించారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న భద్రంను పరామర్శించిన అడపా అనీల్ చౌదరి



**తల్లాడ/, జూన్ 18 (జర్నలిస్ట్ వార్త)**
మండల పరిధిలోని నూతనకల్లు గ్రామానికి చెందిన విలసాగరపు భద్రం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు అడపా అనీల్ చౌదరి ఖమ్మంలోని ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. భద్రం చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన డాక్టర్ కల్యాణపు రమేష్ ఆధ్వర్యంలో భద్రంకు చికిత్స కొనసాగుతోందని, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్న ఆయన సేవలు అభినందనీయమని అనీల్ చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనకల్లు గ్రామ సీనియర్ నాయకుడు కల్యాణపు వెంకటయ్యతో కలిసి భద్రం ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భద్రం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# రవి నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.





**బయ్యారం,/జూన్ 18(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భుక్యా రవి నాయక్ కుమారుడికి ఇటీవల అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న క్రమంలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చిన్న ఆపరేషన్ నిర్వహించి డిశ్చార్జ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య భూక్యా రవి నాయక్ స్వగ్రహనికి వెళ్ళి వారి కుమారుడిని పరామర్శించి మనోధైర్యం కల్పించి పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు,సొసైటి చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,నాయకులు రాసమల్ల నాగేశ్వరరావు,కొత్తపేట సర్పంచ్ భుక్యా ప్రవీణ్ నాయక్,సొసైటి డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు చెరుకుపల్లి నరేందర్ తదితరులు ఉన్నారు.

# ఏఐలో శిక్షణ.. పాఠశాల విద్యార్థులకు బోధన

## అన్నఅక్క మెంటార్‌షిప్ కార్యక్రమంలో వినూత్న ముందడుగు







**నర్సంపేట,/ జూన్ 18 (జర్నలిస్ట్ వార్త)**
కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ లెర్నింగ్ రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన అన్నఅక్క మెంటార్‌షిప్ కార్యక్రమానికి నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) వేదికైంది. కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులకు రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము నేర్చుకున్న ఏఐ పరిజ్ఞానాన్ని పాఠశాల విద్యార్థులకు బోధించడం ద్వారా అంశంపై మరింత అవగాహన, నైపుణ్యం పెంపొందించుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని తృతీయ సంవత్సరం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం తృతీయ సంవత్సరం విద్యార్థులు సమీప ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 15 రోజుల పాటు రోజుకు రెండు గంటల చొప్పున కృత్రిమ మేధస్సు, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు గాను వారికి రెండు క్రెడిట్ మార్కులతో పాటు ప్రత్యేక సర్టిఫికెట్ అందజేయనున్నారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల మాస్టర్ ట్రైనర్ ఏ. శాంతరాజు శిక్షణ అందిస్తూ, ఏఐ వినియోగంతో వివిధ రంగాల్లో నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు డాక్టర్ వి. పూర్ణచందర్, డాక్టర్ ఎం. సోమయ్య, డాక్టర్ డి. సంధ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**తల్లాడ/, జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో గొల్లమందల పుల్లయ్య, గోపమ్మ దంపతుల కుమార్తె వివాహ వేడుకకు తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ, వైస్ ప్రెసిడెంట్ సుహాసిని, తొలి వార్డు సభ్యురాలు ఎక్కిరాల లక్ష్మి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు

## రూ.53.98 లక్షల ఆదాయం



**ఐనవోలు/జూన్18(జర్నలిస్ట్ వార్త):**
ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపును ఘనంగా నిర్వహించారు. గత 78 రోజులకు (తేదీ 30.03.2026 నుండి 18.06.2026 వరకు) గాను భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో హుండీ ద్వారా రూ.9,98,694 ఆదాయం రాగా, వివిధ రకాల ఆర్థిక సేవ టికెట్ల ద్వారా రూ.43,99,767 ఆదాయం లభించింది. మొత్తంగా ఆలయానికి రూ.53,98,461 ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులు సమర్పించిన మిశ్రమ వెండి, బంగారాన్ని అధికారులు సీల్ చేసి ఆలయ హుండీలో భద్రపరిచారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డివిజన్ పరిశీలకురాలు నందనం కవిత ఆధ్వర్యంలో ఈ లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా సాగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, చైర్మన్ కమ్మగొని ప్రభాకర్ పాల్గొన్నారు. ఐనవోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ కనకస్వామి, పరమేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది. కరీంనగర్‌కు చెందిన శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ సభ్యులు కానుకల లెక్కింపు సేవలో పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక సాధికారత : జిల్లా ధర్మయ్య

## గో టు విలేజ్ లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పిలుపు -కొత్తపల్లిలో విద్యా చైతన్య సదస్సు



**వర్ధన్నపేట/ జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):**
అన్ని రకాలుగా వెనుకబాటుతనానికి గురైన మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా గో టు విలేజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వర్ధన్నపేట మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ తెలిపారు. గురువారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థుల విద్యా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి పల్లె, బస్తీల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను సంపూర్ణంగా అందుకోవాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు.
రాబోయే జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ప్రతి మాదిగ పల్లెలో దండోరా నూతన దిమ్మలను ఏర్పాటు చేసి పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు చాడ కరుణాకర్, నాయకులు బీస్వాక సామి, వీరసామి, సుమన్, అఖిల్, స్వామి సైదులు, ఎల్లమ్మ, కోమల, విద్యార్థులు బ్లెస్సి, తేజ, అనూష, శ్రావణ్ కుమార్, విన్ను, విమల తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల ప్రైవేటు బాట వీడి.. సర్కారు బడి వైపు!

## అంబేద్కర్ నగర్ సర్పంచ్ చీటూరి రాజు పిలుపు

### ప్రభుత్వ పాఠశాలలో చేరిన వార్డు సభ్యుడి కుమారుడు



**వర్ధన్నపేట/జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):** వ్యాపార ధోరణితో నడుస్తూ, కేవలం ర్యాంకుల వేటలోనే విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల మోజును వీడాల్సిన సమయం ఆసన్నమైందని వర్ధన్నపేట మండలం అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చీటూరి రాజు అన్నారు. గురువారం గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యుడు యాకర సందీప్ తన కుమారుడిని ప్రైవేటు పాఠశాల నుంచి విడిపించి, స్థానిక ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు పెంచేస్తున్న అడ్డగోలు ఫీజులతో సామాన్య తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పుస్తకాల పురుగులుగా మార్చడమే లక్ష్యంగా సాగుతున్న ప్రైవేట్ చదువుల్లో పిల్లలకు కనీస మానసిక ఉల్లాసం కరువైందని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన నాణ్యమైన బోధన అందుతోందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన ఆటస్థలాలు, ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని గుర్తుచేశారు. కార్పొరేట్ శైలికి భిన్నంగా సర్కారు బడులు సకల వసతులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బహిరంగ చర్చకు సిద్ధం.

## బీఆర్ఎస్ సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్

**వర్ధన్నపేట/జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీలో అభివృద్ధి, అవినీతిపై బీఆర్ఎస్ విసిరిన సవాల్‌ను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వీకరించాయి. ఈ మేరకు మండల, టౌన్ కాంగ్రెస్ కమిటీలు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గత పదేళ్ల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హయాంలో జరిగిన అవినీతి, విధ్వంసంపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించాయి. మున్సిపాలిటీ నిధుల దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, సైడ్ కాల్వల విధ్వంసంలో జరిగిన పర్సంటేజీల లెక్కలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశాయి. బీఆర్ఎస్ హయాంలోనే నిర్లక్ష్యం వల్ల చెరువు కట్ట తెగి రైతులు ఇబ్బంది పడ్డారని, చారిత్రాత్మక గెస్ట్ హౌస్, గాంధీ, నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను జేసీబీలతో కూల్చివేసింది ఎవరని నిలదీశాయి. వివాదాస్పద పెట్రోల్ పంపునకు అనుమతులు ఇచ్చి దండుకున్నది బీఆర్ఎస్ నాయకులేనని ధ్వజమెత్తాయి. మూడో వార్డు కౌన్సిలర్ స్వలాభం కోసం పార్టీలు మారుస్తూ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ఎదుగుదలను ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, చర్చకు వస్తే, ఆయన నిజస్వరూపాన్ని మూడో వార్డు ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

# అభివృద్ధి నిరూపిస్తే కౌన్సిలర్ పదవికి రాజీనామా

## -బీఆర్ఎస్ సవాల్

**వర్ధన్నపేట/జూన్ 18 (జర్నలిస్ట్ వార్త):** గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ హయాంలో వర్ధన్నపేట పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఒకవేళ నిరూపిస్తే తన 3వ డివిజన్ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ నేత సవాల్ విసిరారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఒక ప్రకటనలో ఆయన కాంగ్రెస్ నాయకుడి పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చేవే తప్ప వర్ధన్నపేటకు ప్రత్యేకంగా తెచ్చినవి కావన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ప్రత్యేక చొరవతోనే వర్ధన్నపేట మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిందని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, 100 పడకల ఆసుపత్రి, మున్సిపల్ భవనం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు.
అప్పట్లో తాము ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ పనులను ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల హడావిడిలో కేవలం శిలాఫలకాలకే కాంగ్రెస్ పరిమితమైందని ఎద్దేవా చేశారు. తాత్కాలిక కోర్టు కోసం గతంలో నిర్మించిన డివైడర్లను కూల్చడం ప్రజల సొమ్మును వృధా చేయడమేనన్నారు. నిన్నటి కౌన్సిల్ సమావేశంలో రూ.1.97 కోట్ల తీర్మానాలకు తాము ఆమోదం తెలపకపోతే అభివృద్ధిని అడ్డుకున్నట్లా అని ప్రశ్నించారు. చలివేంద్రాలు, ప్రైవేట్ వాహనాల డీజిల్ ఖర్చులకు తాము ఎలా ఆమోదం తెలుపుతామని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యే కలిసి అంబేద్కర్ సెంటర్ లో బహిరంగ చర్చకు రావాలని, తాము చేసిన అభివృద్ధిని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

